సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం। 15। జూలై। 2024



నిండుతున్న జలాశయాలు
కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని జలాశయాలు, చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. 8లో



బదిలీలు సరే.. బకాయిలెలా?
జిల్లాలోని పలు గ్రామాల్లో కార్యదర్శులు సొంత ఖర్చులతో పనులు చేపట్టగా బదిలీల ప్రక్రియతో వారిలో గందరగోళం నెలకొంది. 10లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 27°/24°
జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని చోట్ల సాయంత్రం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యకల్యాణంలో 85 జంటలు పాల్గొన్నాయి.

పెద్దమ్మతల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్‌: పాల్వంచ మండలం కేశవాపురం - జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు కావడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించగా, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, అమ్మవారిని మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ కొత్వాల శ్రీనివాసరావు దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆయనకు ఈఓ రజనీకుమారి, అర్చకులు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. నాయకులు యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, మహిపతి రామలింగం పాల్గొన్నారు.కాగా, పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి దమ్మపేట, గట్టాయిగూడెం, సారపాకకు చెందిన పి.సత్యనారాయణ - మంగతాయారు, అంకం శంకరయ్య - రాధమ్మ, రవిచంద్రబాబు - వాణిశ్రీ దంపతులు రూ.5,116 చొప్పున విరాళం అందజేశారని ఈఓ తెలిపారు.

గోటి తలంబ్రాల విత్తనాలకు పూజలు



విత్తనాలతో భక్తమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది

భద్రాచలంటౌన్‌: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి కల్యాణ మహోత్సవంలో వినియోగించే కోటి గోటి తలంబ్రాల విత్తనాలకు ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ విత్తనాలతో నారుపోసి ధాన్యం పండిస్తామని, వాటినే గోటితో ఒలిచి స్వామివారి కల్యాణోత్సవానికి తీసుకొస్తామని జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చెల్పూర్‌ గ్రామానికి చెందిన తిరుపతయ్య - తిరుపతమ్మ దంపతులు తెలిపారు. కార్యక్రమంలో చెల్పూరు గ్రామ రామదాసు భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

26 కి.మీ. పీఆర్‌ రహదారులు ఆర్‌అండ్‌బీకి...

ఖమ్మంఅర్బన్‌: ఖమ్మం నియోజకవర్గంలోని పంచాయతీరాజ్‌ పరిధి రహదారులను ఆర్‌అండ్‌బీ శాఖలోకి బదలాయించాలని ఆయా శాఖల ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించిన నేపథ్యాన త్వరలోనే ఉత్తర్వులు విడుదల కానున్నాయని తెలిసింది. ఇటీవల ప్రధాన మంత్రి సడక్‌ యోజన పథకంలో నిర్మించిన రోడ్లను కాంట్రాక్టర్లు ఐదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంది. దీంతో ఇవి మినహా రఘునాథపాలెం మండలం, ఖమ్మంలోని ప్రధాన పీఆర్‌ రోడ్లను ఆర్‌అండ్‌బీలోకి బదలాయించేందుకు ప్రతిపాదించారు. కాగా, పీఆర్‌ శాఖ పరిధిలో ఉన్న లింక్‌ రోడ్లు ఐదు కి. మీ. దాటాక ఆర్‌అండ్‌బీలోకి బదలాయిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఇదే అంశంపై ఇటీవల రఘునాథపాలెంలో సమీక్షించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు.

మీసేవలో మహిళలు !

- మహిళా శక్తి పథకంలో ఏర్పాటుకు అవకాశం
- జిల్లాలో కొత్తగా మరో 36 మీ సేవ కేంద్రాలు
- పల్లె ప్రాంత ప్రజలకు తగ్గనున్న దూరాభారం



దమ్మపేటలోని మీ సేవ కేంద్రం

చుంచుపల్లి: మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకుగాను బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తూ అండగా నిలుస్తున్నాయి. అటు మహిళలు సైతం ప్రభుత్వం రుణాలను సద్వినియోగం చేసుకుంటూ పలు వ్యాపారాలు నిర్వహిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. డ్వాక్రా గ్రూప్‌ మహిళలను మరింతగా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా అతివల చేతికే మీ సేవ కేంద్రాలను అప్పగించేందుకు మరో ముందడుగు వేసింది. ఈ నిర్ణయం మహిళలకు ఎంతో చేయూతగా నిలవనుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులతో మహిళా శక్తి మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు జిల్లాలో ఇప్పటికే కసరత్తు జరుగుతోంది. వీటిని వచ్చే నెల 15లోపు అందుబాటులోకి తేవాలని డీఆర్‌డీఏ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 36 మీ సేవ కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించారు. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘం సభ్యులు చూసుకోనున్నారు. ఈ కేంద్రాలను గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, రైతు వేదికలతో పాటు ఇతర వనరులున్న కార్యాలయాల్లో ఏర్పాటు చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడవనున్న ఈ మీ సేవ కేంద్రాల బాధ్యతను గ్రామ సమైక్యలకు అప్పగించారు.

కొత్తగా ఏర్పాటు చేసే సెంటర్లు ఇవే..

జిల్లాలోని 16 మండలాల పరిధిలో నూతనంగా మహిళా శక్తి పథకంలో 36 మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం రాజాపురం, గుంపెన, అశ్వాపురంలో గొందిగూడెం, మొండికుంట - మల్లెల మడుగు, తుమ్మలచెరువు, మిట్టగూడెం, బూర్గంపాడులో సందెళ్ల రామాపురం-ముసలి మడుగు, బూర్గంపాడు, పినపాక పట్టీనగర్‌ - ఉప్పుసాక, ఇరవెండి, నాగినేనిప్రోలు, చంద్రుగొండలో గానుగపాడు, చర్లలో కలివేరు, ఆర్‌.కొత్తగూడెం, దేవరపల్లి, చుంచుపల్లి మండలంలో పెనగడప, దమ్మపేటలో అంకంపాలెం, గండుగులపల్లి, గణేష్‌ పాడు, దుమ్ముగూడెంలో సీతానగరం, సీతారాంపురం, జూలూరుపాడులో కాకర్ల, కరివారిగూడెం, బేతాళపాడు, లక్ష్మీదేవిపల్లి మండలంలో బంగారు చెలక, లోతువాగు, మణుగూరులో రామానుజవరం, పగిడేరు, పాల్వంచలో నాగారం, పినపాకలో దుగినేపల్లి, సింగిరెడ్డిపల్లి, సుజాతనగర్‌లో రాఘవాపురం, సింగభూపాలెం, టేకులపల్లిలో తావురియా తండా, ఇల్లెందు మండలంలో చల్లసముద్రం, సుదిమళ్ల గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయి.



సమావేశమైన డ్వాక్రా మహిళలు (ఫైల్‌)

రూ. 2.50 లక్షల రుణం

జిల్లాలో ప్రస్తుతం 119 మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు నిత్యం వివిధ రకాల సేవలు అందుతున్నాయి. అవి కాకుండా మహిళా శక్తి పథకంలో స్వయం సహాయక సంఘాల మహిళలు మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. దీనికి ప్రభుత్వ రుణం పొందే వెసులుబాటు సైతం ఉంది. అవసరమైన చోట మీ సేవ కేంద్రం ఏర్పాటుకు రూ.2.50 లక్షల రుణాన్ని స్త్రీనిధి ద్వారా అందజేయనున్నారు. వీటి ద్వారా మీ సేవ కేంద్రానికి అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్‌, బయోమెట్రిక్‌ పరికరాలు, కెమెరాలు, ఇంటర్నెట్‌ కనెక్షన్‌ ఏర్పాటు చేసుకోవాలి. ఈ రుణాన్ని వాయిదా పద్ధతిలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. గ్రామ సంఘాల వద్ద డబ్బులుంటే ముందుగానే ఆయా పరికరాలు కొనుగోలు చేసుకోవచ్చు. కొత్త మీ సేవ కేంద్రాలను గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు దూరాభారం తగ్గనుంది. దీనికి సంబంధించి ఇంకా పూర్తి మార్గదర్శకాలు వెలువడాల్సి ఉంది.

ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం



మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాలో 36 మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. వీటికి సంబంధించి ఆయా గ్రామాల్లో స్థలాల గుర్తింపునకు కొంత కసరత్తు జరుగుతోంది. మహిళలకు మీ సేవ కేంద్రాలు కేటాయించటం శుభపరిణామం. వీటిని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



రైల్వే అధికారితో చర్చిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన నాయకులు

కొత్తగూడెంరూరల్‌: ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన కొత్తగూడెంలో పర్యటించారు. మొదట భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలిగించవద్దని అధికారులకు సూచించారు. రైల్వేస్టేషన్‌ నుంచి రద్దయిన రైళ్లను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం విద్యానగర్‌లోని పొంగులేటి క్యాంప్‌ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో తనకు 75 వేల ఓట్ల మెజార్టీ అందించిన ప్రజలకు పాదాభివందనాలు తెలుపుతున్నానని అన్నారు. కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర మంత్రులతో మాట్లాడుతానని చెప్పారు. రైల్వే అధికారులతో మాట్లాడి గొల్లగూడెం రోడ్డు వెడల్పునకు స్థల సేకరణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. ఆయన వెంట జెడ్పీ చైర్మన్‌ కంచర్ల చంద్రశేఖర్‌రావు, రైల్వే స్టేషన్‌ మాస్టర్‌ విశ్వనాథ్‌, అధికారులు రామ్‌భజన్‌ వీణ, పాషా, రాజారెడ్డి, ఎండీ ఇర్ఫాన్‌, ఎండీ జావీద్‌, జేమ్స్‌పాల్‌, ఖాజా బాబా, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, మహిళా కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, నాయకులు ఆళ్ల మురళి, నాగేంద్రత్రివేది, గోపాల్‌రావు, కోనేరు సత్యనారాయణ, జేవీఎస్‌ చౌదరి, మేరెడ్డి జనార్దన్‌ రెడ్డి, చీకటి కార్తీక్‌, పాల సత్యనారాయణరెడ్డి, బాల ప్రసాద్‌, సుందర్‌లాల్‌ కోరి, రజాక్‌ ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు

పాల్వంచరూరల్‌ : మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారిని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ఆదివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు, ఈఓ ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం కేటీపీఎస్‌ గెస్ట్‌హౌస్‌లో అధి కారులు, కాంగ్రెస్‌ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్‌ కంచర్ల చంద్రశేఖర్‌, జెడ్పీటీసీ బి.వాసుదేవరావు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, నాయకులు జాలే జానకిరెడ్డి, కొండం వెంకన్న, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అర్చకుల బదిలీలు నిలిపేయాలి



ఎమ్మెల్యే వెంకట్రావుకు సమస్యలు వివరిస్తున్న అర్చక సంఘం నాయకులు

భద్రాచలంటౌన్‌: రాష్ట్రంలోని పలు దేవాలయాల అర్చకులు, సిబ్బందిని బదిలీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని భద్రాచలం రామాలయ అర్చకులు స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. బదిలీ చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉద్యోగులు, అర్చకుల జాబితాను సేకరించగా ప్రముఖ ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులు ఆందోళనకు దిగారు. బదిలీలు కోరుకున్న వారితో పాటు నాలుగేళ్లకు పైగా ఒకే చోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించేలా ప్రభుత్వం జాబితా సిద్ధం చేసింది. గతంలో అర్చకులు మినహా శాఖాపరమైన సిబ్బందిని మాత్రమే బదిలీ చేసేవారని, ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విరమించుకోవాలని అర్చకులు డిమాండ్‌ చేస్తున్నారు. తాము నమ్మిన దేవుడికి ఏళ్లుగా సేవలు చేస్తున్నామని, ఆలయాల ఆగమ శాస్త్రాలను అనుసరించి పూజాది క్రతువులు చేశామని, ఇప్పుడు బదిలీల పేరుతో మరో ఆలయానికి పంపిస్తే అక్కడి శాస్త్రాలకు అనుగుణంగా పూజలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వ నిర్ణయం ఆగమ శాస్త్రానికి విఘాతం కల్పిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అర్చకులు అందించిన వినతిపత్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే.. ఈ సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా సీఎం రేవంత్‌ రెడ్డి దృష్టికి తీసుకెళతామని, సమస్య పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వరద నివారణ చర్యలు చేపట్టాలి
- భద్రాద్రిలో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ఆదేశం



డ్రెయినేజీని పరిశీలిస్తున్న కలెక్టర్‌ పాటిల్‌, అధికారులు

భద్రాచలంటౌన్‌: గోదావరి నదికి వరద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలు ముంపు బారిన పడకుండా చూడాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ఆదేశించారు. భద్రాచలంలో వరద ప్రభావిత ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్‌లో పంపింగ్‌ మోటార్లను తనిఖీ చేశారు. అవసరమైతే అదనపు మోటార్లు అందుబాటులో ఉంచాలన్నారు. చిన్నపాటి వర్షానికే రామాలయంతో పాటు పలు కాలనీల్లోకి వరద నీరు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గోదావరి వరద ఏమాత్రం పెరిగినా వెంటనే ముంపు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, ఈ మేరకు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. విస్తా కాంప్లెక్స్‌ పక్కనున్న డ్రెయినేజీలో చెత్త పేరుకుపోకుండా గ్రామపంచాయతీ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. డ్రెయిన్లలో చెత్త పేరుకుపోతే నీరు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అనంతరం కూనవరం రోడ్డులో కొత్తగా నిర్మించే కరకట్ట ప్రదేశాలను సందర్శించి, పనులు ఏ మేరకు పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించే డంపింగ్‌ యార్డ్‌ను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి డంపింగ్‌ యార్డ్‌లోనే వేయాలని, ఈ విషయంలో పంచాయతీ ఈఓ దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ రాంప్రసాద్‌, తహసీల్దార్‌ శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ఆర్‌ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉత్తర్వులు సవరించాలి

టీపీటీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి



మాట్లాడుతున్న నాగిరెడ్డి, పక్కన నాయకులు

పాల్వంచరూరల్‌ : గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులను సవరణ చేయాలని టీపీటీఎఫ్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాలలన్నీ వాగులు, ఒర్రెలు, కనీస రహదారి సౌకర్యం లేని ప్రాంతాల్లోనే ఉన్నాయని, అలాంటి వాటికి నాలుగో కేటగిరీగా చేర్చి ఐదు పాయింట్లు ఇవ్వాలని, అర్హులైన ఉపాధ్యాయులను కన్వర్టెడ్‌ పాఠశాలలకు బదిలీ చేయాలని అన్నారు. రెగ్యులర్‌ పోస్టులో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులకు సూపర్‌ న్యూమరరీ సర్వీస్‌ను బదిలీలకు పరిగణించాలన్నారు. పురుష ఉపాధ్యాయులను బాలికల పాఠశాలలకు బదిలీ చేయొద్దని డిమాండ్‌ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.రాజు, హీరాలాల్‌, నాయకులు రామాచారి, గుమ్మడి సమ్మయ్య, బి.ప్రసాదరావు, జె.రాంబాబు, రమేష్‌, కృష్ణబాబు, కిషన్‌, రామచంద్‌, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్‌ : మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. డ్యామ్‌ సమీపంలో నుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. మొత్తం 828 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్‌ శాఖకు రూ.29,545, 280 మంది బోట్‌ షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.17,290 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊపిరి పోసిన వాన



అన్నపురెడ్డిపల్లిలో సాగు చేసిన వరి

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం
- 17 మండలాల్లో అధికంగా నమోదు
- ఇప్పటివరకు జిల్లాలో వర్షాకాలం సాగు 82 శాతం

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు ఊపిరి పోశాయి. ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 17 మండలాల్లో అధికంగా వర్షం కురిసింది. జిల్లాలో వానాకాలం పంటల సాధారణ విస్తీర్ణం 4,71,622 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేయగా ఇప్పటి వరకు 3,90,384 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. అంటే పంటల సాగు 82 శాతంగా నమోదైంది. వరి సాగు ఇప్పుడిప్పుడే ఊందుకుంటోంది. వరి సాధారణ విస్తీర్ణం 1,60,332 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 6,826 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇంకా చాలా చోట్ల నార్లు సిద్ధం చేయగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇక పత్తి సాధారణ విస్తీర్ణం కంటే అధికంగానే సాగు చేస్తున్నారు. ఈ పంట సాధారణ విస్తీర్ణం 1,56,212 ఎకరాలు కాగా, ఇప్పటికే 1,88,263 ఎకరాల్లో విత్తనాలు వేశారు.

జూలైలో 183.5 మి.మీ.

జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 164.4 మి.మీ కాగా 227.6 మి.మీ వర్షపాతం నమోదైంది. జూలైలో ఇప్పటివరకు 120.8 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 183.5 మి.మీ.మేర కురిసింది. మొత్తంగా ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 285.3 మి.మీకు గాను 411.1 మి.మీ. నమోదైంది. కరకగూడెం, పినపాక, చర్ల, అశ్వాపురం, మణుగూరు, ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్‌, పాల్వంచ, బూర్గంపాడు, భద్రాచలం, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో అధిక వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. కాగా, దుమ్ముగూడెం, ఇల్లెందు, టేకులపల్లి, చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో మాత్రం సాధారణ వర్షపాతం నమోదైందని తెలిపారు.

జిల్లాలో పంటల సాగు వివరాలిలా.. (ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	సాగైంది
వరి	1,60,332	6,826
మొక్కజొన్న	41,503	41.025
పత్తి	1,56,212	1,88,263
పెసర	264	46
కంది	5,825	604
వేరుశనగ	1,871	0
జీలుగు	–	28,327
జనుము	–	4,705
ఆయిల్‌పామ్‌	37,053	64,436
కూరగాయలు	481	0
ఇతర పంటలు	48,496	56,104

శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షపాతం వివరాలిలా..

మండలం	కురిసిన వర్షం(మి.మీ.)
కరకగూడెం	5.8
పినపాక	0
చర్ల	7.2
దుమ్ముగూడెం	12.4
అశ్వాపురం	20.4
మణుగూరు	28.4
ఆళ్లపల్లి	1.0
గుండాల	0
ఇల్లెందు	0
టేకులపల్లి	0
జూలూరుపాడు	1.09
చంద్రుగొండ	23.2
అన్నపురెడ్డిపల్లి	20.6
చుంచుపల్లి	14.6
సుజాతనగర్‌	0
కొత్తగూడెం	20.0
లక్ష్మీదేవిపల్లి	12.0
పాల్వంచ	35.8
బూర్గంపాడు	24.2
భద్రాచలం	19.8
ములకలపల్లి	47.8
దమ్మపేట	20.0
అశ్వారావుపేట	24.8

వ్యవసాయ పనులు ముమ్మరం చేశాం



వర్షాలు పెరగడంతో వ్యవసాయ పనులు ముమ్మరం చేశాం. సీజన్‌కు ముందు వర్షం రాకుండా భయపెట్టింది. ఇప్పుడు ఆశించిన స్థాయిలో వర్షం పడడంతో సంతోషంగా ఉంది.

– పులిచర్ల సతీష్‌, రైతు, అబ్బుగూడెం

82 శాతం మేర సాగు



జిల్లాలో వానాకాలం సాగు 82 శాతం పూర్తయింది. వర్షాలు బాగా కురుస్తుండడంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేయడంతో విస్తీర్ణం పెరిగింది. రైతులు వ్యవసాయాధికారుల సూచనలను పాటిస్తూ అధిక దిగుబడి సాధించాలి.

– బి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

ఎస్సై కుటుంబానికి ఆర్థికసాయం

రూ.25లక్షల చెక్కు అందించిన బ్యాచ్‌మేట్లు



ఎస్సై భార్య కృష్ణవేణికి చెక్కు అందిస్తున్న తోటి ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి తోటి ఉద్యోగులంతా అండగా నిలిచారు. శ్రీనివాస్‌తో కలిసి 2014లో ఎస్సై ఉద్యోగం సాధించిన ఏపీ, తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ ద్వారా రూ.25 లక్షలు సేకరించారు. ఆదివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటలోని ఎస్సై శ్రీనివాస్ నివాసానికి వెళ్లి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుని భార్య కృష్ణవేణికి సొసైటీ ద్వారా సేకరించిన రూ.25 లక్షల చెక్కును అందించారు. ఎస్సై స్థాయి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని, శ్రీనివాస్ కుటుంబానికి తమ వంతు సహకారం ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

రూ.13లక్షలతో గ్రంథాలయ నిర్మాణానికి భూమిపూజ



లైబ్రరీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఏన్కూరు: ప్రజలకు ఉపయోగపడే పనులు చేసేందుకు అందరూ ముందుకు రావాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచందర్ కోరారు. ఏన్కూరు గురుకుల విద్యాలయంలో అభయ ఫౌండేషన్, పూర్వ విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యాన రూ.13 లక్షలతో గ్రంథాలయ భవనానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ నుంచి రూ.8లక్షలతో పాటు పూర్వ విద్యార్థులు సమకూర్చిన రూ.5లక్షలతో లైబ్రరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తడి శ్రీనివాసరెడ్డి, పూర్వ విద్యార్థులు బండి గిరిబాబు, జోగారావు, కృష్ణయ్య, భిక్షం, వెంకన్న, వేల్పుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

లింక్ నొక్కితే రూ.2.72లక్షలు మాయం

ఇల్లెందు: సైబర్ నేరగాడు ఇన్‌స్టాగామ్‌లో లింకు పంపి భారీగా నగదు కాజేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని 24 ఏరియా సూపర్ బజార్‌కు చెందిన ఆర్.ధీరజ్‌కు ఓ అపరిచితుడు ఇన్‌స్టాగామ్‌లో లింకు పంపి నగదు వస్తాయని ఆశచూపాడు. దీంతో అపరిచితుడు చెప్పినట్లు లింక్ నొక్కి, కొంత నగదు పంపించాడు. అనంతరం ధీరజ్ ఖాతా నుంచి మరికొంత నగదు కట్ అయింది. మొత్తం రూ.2.72 లక్షలు కోల్పోయాక ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ బత్తుల సత్యనారాయణ కేసు నమోదు చేసి, విచారణకు సైబర్ విభాగానికి పంపించారు.

లారీ బోల్తా

దమ్మపేట: మొక్కల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన మండలంలోని గట్టుగూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండల పరిధిలోని మందలపల్లి నర్సరీ నుంచి మామిడి మొక్కలతో లారీ ఖమ్మం వైపు బయలుదేరింది. ఈ క్రమంలో గట్టుగూడెం గ్రామ శివారులో అదుపుతప్పి, బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు.

పోలీసుల అదుపులో డీజిల్ దొంగలు?


1,100 లీటర్ల డీజిల్ స్వాధీనం

నేలకొండపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆగి ఉన్న లారీలు, ఇతరత్రా వాహనాల నుంచి డీజిల్ చోరీ చేస్తున్నారని ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యాన శనివారం అర్ధరాత్రి నేలకొండపల్లి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా డీజిల్ తీసుకెళ్తున్న ఓ వాహనాన్ని గుర్తించారు. క్షుణ్ణంగా పరిశీలించగా డ్రమ్ముల్లో 1,100 లీటర్ల డీజిల్ లభించడంతో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలో చోరీ చేసి విక్రయానికి తీసుకెళ్తున్నట్లు తేలింది. నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన ఓ వ్యాపారి ముఠాలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారని సమాచారం. ఈవిషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. ఎస్సై తోట నాగరాజు ను వివరణ కోరగా... డీజిల్‌ను స్వాధీనం చేసుకోగా, కేసు విచారణ కొనసాగుతోందని తెలిపారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

పెనుబల్లి: మండలంలోని మండాలపాడు శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

నిండుతున్న జలాశయాలు

- కొద్దిరోజులుగా కురుస్తున్న వానలతో జలకళ
- ప్రాజెక్ట్‌లు, చెరువుల్లోకి చేరుతున్న వరదనీరు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు, చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. వరదనీరు చేరి కుంటలు, చెరువులు క్రమేపీ నిండుతున్నాయి. పంటలకు సాగునీరు అందే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2,364 చెరువులు ఉండగా, 78 చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. మరో 463 చెరువుల్లో 100 శాతం మేరకు నీరు చేరింది. 680 చెరువులు 75శాతం, 439 చెరువులు 50శాతం, 704 చెరువులు 25శాతం వరకు నిండాయి. దీంతో రైతులు సాగు పనులు ముమ్మరం చేశారు.

– పాల్వంచరూరల్



పాల్వంచ మండలంలో అలుగుపోస్తున్న రాళ్లవాగు ప్రాజెక్ట్

వాగుల వద్ద ప్రమాదాలకు అవకాశం

వర్షాలకు వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, బావులు నీటితో నిండుతున్నాయి. ఈ క్రమంలో సరదా కోసం వెళ్తే ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి లేకపోలేదు. గోదావరి, కిన్నెరసాని, ముర్రేడువాగుల్లో సుడిగుండాలు ఉండటంతో దిగేవరకు లోతు అంచనా దొరకదు. గతంలో నదులు, వాగుల వద్ద ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. గతేడాది ఇద్దరు చిన్నారులు పాల్వంచ మండలంలోని రంగాపురం వద్ద కిన్నెరసాని వాగులో ఈతకు వెళ్లి సుడిగుండంలో పడి మృత్యువాత పడ్డారు. నాగారం గ్రామ వద్ద కూడా ఓ యువకుడు సుడిగుండంలో పడి మృతి చెందాడు. సూరారం, పాండురంగాపురం గ్రామాల మధ్య కిన్నెరసాని వాగులో పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. కిన్నెరసాని ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన క్రమంలో దిగువన స్నానాలు చేస్తున్న ఏడుగురు ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి చనిపోయారు. మూడేళ్ల క్రితం కిన్నెరసాని ప్రాజెక్ట్ వద్ద ములకలపల్లి మండలానికి చెందిన ఇద్దరు పాఠశాల విద్యార్థులు ఈతకు వెళ్లి నీటిలో పడి మృతి చెందారు. గతేడాది కిన్నెరసాని నుంచి కేటీపీఎస్ కర్మాగారానికి నీటి సరఫరా జరిగే కాల్వలో ఈతకు వెళ్లి ముగ్గురు విద్యార్థులు మృత్యువాత పడ్డారు. తాగునీటి కోసం కాలువలో దిగి ఇద్దరు మృతి చెందారు. దుమ్ముగూడెం మండలం సీతానగరం సమీపంలో గుబ్బల మంగివాగులో గల్లంతై ఓ వ్యక్తి మృతి చెందాడు. గతేడాది ముర్రేడు వాగులో పడి రామవరానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. జలాశయాలు నిండుతున్న నేపథ్యంలో సెలవు రోజుల్లో పిల్లలు చెరువులు కుంటల, వాగులు, వంకల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కిన్నెరసానికి భారీగా వరదనీరు..

జిల్లాలో తాలిపేరు, కిన్నెరసాని, పెద్దవాగు, మూకమామిడి ప్రాజెక్టులు ఉండగా, ఎగువ ప్రాంతాల నుంచి వాటిల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. పాల్వంచ మండలంలోని రాళ్లవాగు ప్రాజెక్ట్ అలుగుపోస్తోంది. కిన్నెరసాని ప్రాజెక్టు నీటి నిల్వసామర్థ్యం 407 అడుగులు కాగా ఆదివారం నీటిమట్టం 401.70 అడుగులకు చేరింది. జలాశయంలోకి 5,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ ప్రాజెక్ట్ కింద 10 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. వరద నీటితో ములకలపల్లిలోని మూకమామిడి ప్రాజెక్ట్ కూడా సగం మేర నిండింది.



జలకళ సంతరించుకుంటున్న కిన్నెరసాని జలాశయం



మూకమామిడి ప్రాజెక్ట్‌లో చేరిన వరదనీరు

చెరువులు నిండుతున్నాయి..



ఈసారి గతేడాది కంటే వర్షాలు బాగానే కురుస్తున్నాయి. వచ్చే నెలలో వర్షాల ప్రభావం అధికంగా ఉండవచ్చు. జిల్లాలో చెరువులు, జలాశయాలు పూర్తిగా నిండి కళకళలాడే అవకాశం ఉంది. తాలిపేరు, కిన్నెరసాని, పెదవాగు జలాశయాల్లోకి గతేడాది కంటే అధికంగా నీళ్లు వచ్చాయి. జిల్లాలో 2,364 చెరువులు ఉండగా, 78 చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. వర్షం ప్రభావం ఇలాగే ఉంటే మొత్తం చెరువులు నిండి అలుగు పోసే అవకాశం ఉంది.

– శ్రీనివాసరెడ్డి, సీఈ, జలవనరులశాఖ

తాలిపేరుకు 5 వేల క్యూసెక్కులు..

తాలిపేరు ప్రాజెక్టు నీటి నిల్వసామర్థ్యం 730 ఎంసీఎఫ్‌టీ కాగా ఆదివారం నీటిమట్టం 328 ఎంసీఎఫ్‌టీగా నమోదైంది. ప్రాజెక్ట్‌లోకి సుమారు ఐదు వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, అదేస్థాయిలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీని కింద 24,700 ఆయకట్టు సాగవుతోంది. పెదవాగు నీటి నిల్వ సామర్థ్యం 557.890 ఎంసీఎఫ్‌టీ కాగా ఆదివారం 409.539 ఎంసీఎఫ్‌టీగా నమోదైంది. దీని కింద 16 వేల ఆయకట్టు ఉంది. ప్రసుత్తం 190 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది.

16 అడుగులకు చేరిన పెదవాగు ప్రాజెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో ఉన్న పెదవాగు ప్రాజెక్ట్‌కు భారీగా వరదనీరు పోటెత్తింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వాగుల ద్వారా భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 18 అడుగులు కాగా, ఆదివారం సాయంత్రానికి 16 అడుగులకు చేరింది. దీంతో ఆయకట్టు రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.



పెదవాగు ప్రాజెక్ట్‌లో జలకళ

జూనియర్ మైనింగ్ ఇంజనీర్ పరీక్షలో 345 మంది క్వాలిఫై



పరీక్ష హాల్‌లో పరిశీలిస్తున్న జీఎం, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో జూనియర్ మైనింగ్ ఇంజనీర్ ట్రెయినీ(ఇంటర్నల్) పోస్టుల భర్తీకి కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం రాతపరీక్ష నిర్వహించారు. ఈ మేరకు హాల్‌టికెట్లు జారీ చేసిన 375 మందిలో 361 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను జీఎం పర్సనల్(సెక్యూరిటీ అండ్ పర్సనల్) బీఆర్.దీక్షితులు పరిశీలించి మాట్లాడారు. కాగా, పరీక్ష ఫలితాలు సాయంత్రం విడుదల చేయగా 345 మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. మిగతా వారిలో 9మంది అర్హత సాధించకపోగా, ఏడుగురి జవాబుపత్రాలను తిరస్కరించినట్లు తెలిపారు. అధికారులు రాంకుమార్, పి.వేణుగోపాల్‌రావు, వీ.ఎన్‌వీ.ఎస్.ఆర్.శాస్త్రి, పీవీఎస్.శాస్త్రి, జాకీర్ హుస్సేన్, కె.ప్రకాశ్‌రావు, నాగేశ్వరరావు, కె.సంతోష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త 'బాట'లో...



చిన్నారులకు ఆటపాటలు నేర్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

- అంగన్‌వాడీల్లో చిన్నారుల చేరికకు కార్యాచరణ
- నేటి నుంచి 20 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లాలో 2,060 కేంద్రాలు

భద్రాచలంఅర్బన్ : పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మమాట– అంగన్‌వాడీ బాట' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అంగన్‌వాడీ టీచర్లకు విడతల వారీగా శిక్షణ పూర్తి చేయగా సోమవారం నుంచి 20వ తేదీ వరకు పిల్లలకు అక్షరాలు, అంకెలు, ఆటపాటలతో కూడిన విద్యను బోధిస్తారు.

జిల్లాలో 2,060 కేంద్రాలు..

జిల్లాలోని 23 మండలాల పరిధిలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా వాటి పరిధిలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో చిన్నారులకు భోజనం, గుడ్డు, మురుకులు.. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో పాటు పాలు, గుడ్డు అందిస్తున్నారు. ఆయా కేంద్రాల పరిధిలో మూడేళ్ల లోపు చిన్నారులు 34,247 మంది, 3 నుంచి ఆరేళ్ల లోపు పిల్లలు 27,078 మంది, గర్భిణులు 7,650 మంది, బాలింతలు 6,128 మంది ఉన్నారు. చిన్నారులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు కేంద్రాల్లో ఉంటున్నారు. వాటిని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇటీవల పూర్వ ప్రాథమిక విద్యను అమలు పర్చాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తుండడంతో బడిబాట మరోసారి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత నెలలో దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలో చేపట్టిన బడిబాటలో 2150 మంది పిల్లలు కేంద్రాల్లో చేరగా, జిల్లా వ్యాప్తంగా ఉన్న మరో 10 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఈ సంఖ్య అధికారికంగా తెలియాల్సి ఉంది. కాగా, ఈనెల 15, 16 తేదీల్లో గ్రామాల్లో ర్యాలీలు, 18న ఇంటింటికీ వెళ్లి రెండున్నరేళ్లు దాటిన పిల్లల గుర్తింపు, పూర్వ ప్రాథమిక విద్య, బోధనా పద్ధతులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. 19న స్వచ్ఛ అంగన్‌వాడీ నిర్వహణ, 20న సామూహిక అక్షరాభ్యాసాలు, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఐదు రోజుల్లో ఎక్కువ మంది పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించేలా అధికారులు దృష్టి సారించారు.

మిగిలిన వారి కోసం..



అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య అమలు చేస్తుండడంతో చిన్నారుల సంఖ్య పెంచేలా 'అమ్మ మాట.. అంగన్వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. గత నెలలో నిర్వహించిన బడిబాటతో మంచి ఫలితాలు వచ్చాయి. మిగిలిన వారిని ఈ సారి చేర్పించేలా దృష్టి సారిస్తాం. –వేల్పుల విజేత, డీడబ్ల్యూఓ

అందరూ సహకరించాలి..



దుమ్ముగూడెం ఐసీడీఎస్ పరిధిలో గల ప్రతి కేంద్రంలో రోజువారీగా కార్యక్రమాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నాం. ఇప్పటికే టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాం. కార్యక్రమం విజయవంతానికి అందరూ సహకరించాలి.

– నవ్యశ్రీ, దుమ్ముగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ

మహిళ కడుపులో 8 కేజీల కణితి

శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలంఅర్బన్ : ఎనిమిది కేజీల కణిత కడుపులో ఉండగా తీవ్ర నొప్పితో బాధ పడుతున్న ఓ మహిళకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శస్త్రచికిత్స చేసి, ఆమె ప్రాణాలు కాపాడారు. దుమ్ముగూడెం మండలం ఆలుబాక గ్రామానికి చెందిన సీహెచ్.కుమారికి ఇటీవల తరచూ కడుపులో నొప్పి వస్తోంది. ఆదివారం తీవ్రం కావడంతో భద్రాచలంలోని నిఖిత ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు కడుపులో కణితి ఉందని, తక్షణమే ఆపరేషన్ చేయకుంటే ప్రాణానికే ప్రమాదమని చెప్పారు. దీంతో ఆస్పత్రి యజమాని, ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వైద్య బృందంతో కలిసి రెండు గంటల పాటు శ్రమించి కుమారి కడుపులోని కణితిని తొలగించారు. కణితి బరువు ఎనిమిది కేజీలు ఉందని వైద్యులు తెలిపారు. సకాలంలో ప్రాణాలు కాపాడినందుకు గాను కుమారి బంధువులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



మహిళ కడుపులో నుంచి కణితిని తొలగించిన ఎమ్మెల్యే వెంకట్రావు, వైద్యులు

వసతి గృహాలకు 'విజయ' పాలు



ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ కార్యాలయం

- అనుమతి జారీ చేసిన ఉన్నతాధికారులు
- ఉమ్మడి జిల్లాలో 300 హాస్టళ్లకు నిత్యం 6వేల లీటర్ల సరఫరా
- రెండు, మూడు రోజుల్లో మొదలుకానున్న ప్రక్రియ
- నెలకు రూ.1.44 కోట్ల మేర వ్యాపారం

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల ప్రభుత్వ వసతి గృహాలకు 'విజయ' పాల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివిధ కారణాలతో కొన్నాళ్ల నుంచి హాస్టళ్లకు ఓ ప్రైవేట్ సంస్థ పాలు సరఫరా చేస్తోంది. ఇటీవల ఖమ్మం పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ముందుకొచ్చింది. ఈ విషయమై తాజాగా బదిలీ అయిన ఖమ్మం డిప్యూటీ డైరెక్టర్ ధన్‌రాజ్ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఎండీ దృష్టికి తీసుకెళ్లడంతో అనుమతించారు. ఉమ్మడి జిల్లాలోనే కాక రాష్ట్ర వ్యాప్తంగా కూడా విజయ పాలు, పాల ఉత్పత్తులతో పాటు విజయ ప్యాకేజ్డ్ తాగునీరు కూడా హాస్టళ్లు, అవసరమైన సంస్థలకు పంపిణీ చేసేలా ఉన్నతాధికారులు, కలెక్టర్లు అనుమతించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల అధికారులను డీడీ కలిసి అనుమతులు తీసుకోవడంతో హాస్టళ్లు, కేజీబీవీలు, ఆశ్రమ పాఠశాలలు, నవోదయ స్కూళ్లకు విజయ పాల పంపిణీకి మార్గం సుగమమైంది.

రూట్లు ఖరారు..

ప్రభుత్వ అనుమతుల ఆధారంగా ఉమ్మడి జిల్లాలోని ఉన్న 300 హాస్టళ్లకు నిత్యం ఆరు వేల లీటర్ల పాలను సరఫరా చేసేందుకు పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం జిల్లాలో 88 హాస్టళ్లకు ఐదు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని 212 హాస్టళ్లకు ఎనిమిది నుంచి 10 రూట్ల ద్వారా పాల పంపిణీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పాల పంపిణీదారుల ఎంపిక ప్రక్రియ కూడా ఓ కొలిక్కి వచ్చింది. ప్రభుత్వ హాస్టళ్లకు మంగళవారం లేదా బుధవారం నుంచి విజయ తెలంగాణ పాలను పంపిణీ చేసేందుకు పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ సిద్ధమైంది. రెండు జిల్లాల్లో కలిపి ప్రస్తుతం ఆరు వేల వేల లీటర్ల పాలు సేకరిస్తుండగా ప్రభుత్వ హాస్టళ్లలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఈ మొత్తం పంపిణీకి సరిపోతాయని తేల్చారు.

రెండు రోజుల నగదు డిపాజిట్

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని హాస్టళ్లకు పాల పంపిణీ ద్వారా పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ నెలకు రూ.1.44 కోట్ల వ్యాపారం చేసే అవకాశముంది. లీటర్ పాలకు రూ.58 చొప్పున నిత్యం 6వేల లీటర్ల పాల విలువ రూ.3.48 లక్షలుగా లెక్కించారు. తొలుత పంపిణీదారుల నుంచి రెండు రోజులకు సరిపడా నగదును డిపాజిట్‌గా సేకరిస్తారు. ఆపై ఏ రోజుకారోజు నగదు చెల్లించి సంస్థ నుంచి పాలు తీసుకుని సంస్థలు, హాస్టళ్లకు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

గుట్కా ప్యాకెట్లు సీజ్

ఇల్లెందు: పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి ఎదురుగా ఉన్న సత్యనారాయణ కిరాణంలో నిలువ చేసిన గుట్కా ప్యాకెట్లను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని భరత్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

బొంబాయితండాలో పోడు వివాదం

ఇల్లెందురూరల్: మండలంలోని బొంబాయితండా గ్రామశివారులో స్థానికులు, అటవీశాఖ అధికారుల నడుమ పోడు భూ వివాదం నెలకొంది. భూమిని స్వాధీనం చేసుకోవాలని కోర్టు ఆదేశాలు ఇవ్వగా, తాము మొక్కలు నాటేందుకు పనులు ప్రారంభించామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో తమకు ఐటీడీఏ ద్వారా ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరయ్యాయని రైతులు సునీత, వెంకటేశ్వర్లు పేర్కొంటున్నారు. దీంతో ఇరువర్గాలు ఆదివారం కొమరారం పోలీసులను ఆశ్రయించాయి. ఇరువురి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించిన ఎస్సై సోమేశ్వర్ ఐటీడీఏ అధికారులకు సమస్యను వివరించి పరిష్కరించుకోవాలని, అప్పటివరకు భూమిలో ఎలాంటి పనులు చేపట్టొద్దని సూచించారు.

కుమార్తెతో పాటు ఆత్మహత్యాయత్నం

- అంతకుముందే డయల్ 100కు ఫోన్
- కానిస్టేబుల్ స్పందనతో నిలిచిన రెండు ప్రాణాలు



నరేష్‌ను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ బ్రహ్మం

కూసుమంచి: కుటుంబ కలహాల నేపథ్యాన రెండేళ్ల కుమార్తెతో పాటు ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా.. బ్లూకోల్ట్ కానిస్టేబుల్ సరైన సమయానికి చేరుకుని రక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువుకు చెందిన జంపాల నరేష్, ఆయన భార్య నడుమ కుటుంబ కలహాల కారణంగా ఆమె మోతె మండలం తుమ్మలపల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలో నరేష్ శనివారం తన భార్య వద్దకు వెళ్లి రెండేళ్ల కూతురిని తీసుకుని జీళ్లచెరువు వచ్చాడు. రాత్రి 10 గంటల సమయాన ఆటోలో కుమార్తెతో కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్ వద్దకు చేరుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు డయల్ 100కు ఫోన్ చేశాడు. దీంతో అప్రమత్తమైన బ్లూకోల్ట్ కానిస్టేబు ల్ బ్రహ్మం రిజర్వాయర్ వద్దకు చేరుకుని వెతకడం మొదలుపెట్టాడు. అప్పటికే నరేష్ తన చొక్కాకు రాయి కట్టి కాళ్లకు బిగించుకుని పాపతో పాటు నీటిలో దూకేందుకు సిద్ధమయ్యాడు. అదే సమయానికి వచ్చిన కానిస్టేబుల్ బ్రహ్మం ఆయనను అడ్డుకున్నాడు. ఆపై నరేష్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చాక కుటుంబసభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించి ఇద్దరు ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ బ్రహ్మంను పలువురు అభినందించారు.

మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడి

వైరా: భద్రాచలం డిపోకు చెందిన మహిళా కండక్టర్ పి.విజయలక్ష్మిపై ప్రయాణికురాలు దాడి చేయగా.. వైరా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లుకు చెందిన సీహెచ్.అరుణ దంపతులు ఆదివారం చుంచుపల్లిలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తమ కుమారుడి వద్దకు వెళ్లి వస్తున్నారు. ఆపై వైరా మండలం స్టేజీ పినపాకలోని డాన్‌బాస్కో స్కూల్‌లో చదువుతున్న ఇంకో కుమారుడి వద్దకు వెళ్లడానికి సుజాతనగర్‌లో భద్రాచలం డిపో బస్సు ఎక్కారు. అయితే, డాన్‌బాస్కో స్కూల్ వద్ద అరుణ భర్త దిగగా, ఇద్దరి టికెట్ ఆయన వద్దే ఉండిపోయింది. కాసేపయ్యాక టికెట్ విషయమై అరుణను కండక్టర్ విజయలక్ష్మి ఆమెను ప్రశ్నించడంతో వాగ్వాదం జరిగింది. దీంతో కండక్టర్‌ను అరుణ దుర్భాషలాడుతూ దాడి చేసింది. ఘటనపై కండక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వైరా ఏఎస్సై డి.వెంకటనారాయణ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం : మండలంలోని రామారావుపేట గ్రామానికి చెందిన కుర్సం చిన్నారావు (45) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. చిన్నారావు వారం రోజుల క్రితం వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను భద్రాచలం ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గడ్డిమందు తిని కోళ్లు మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం బొజ్జలగూడెం గ్రామ పంచాయతీ తిప్పగుట్ట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కుమారుడు శనివారం బియ్యంలో గడ్డి మందు కలిపి, కోళ్లకు వేశాడు. ఆ బియ్యం తిన్న 20 కోళ్లు అక్కడే చనిపోయాయి. దీంతో బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం సీజ్

జూలూరుపాడు: మండలంలోని భేతాళపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన రేషన్‌బియ్యాన్ని ఆదివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. సుమారు 8 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

ఏపీలో మరో రెండు రోజులు వర్షాలు

ఉపరితల ఆవర్తనం ఫలితం



సాక్షి, అమరావతి: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వచ్చే రెండురోజులు ఏపీ వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతుండగా, శనివారం పశ్చిమ బంగాళాఖాతం, కోస్తాంధ్ర తీరంలో ఏర్పడి సముద్రమట్టానికి సగటున 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం దాంతో కలిసిపోయింది. దీని ప్రభావంతో వచ్చే రెండురోజులు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తా యని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. అనేకచోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడతాయని, అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, పలుప్రాంతాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వివరించారు. ఆదివారం ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా కొయ్యూరులో 24 గంటల్లో 9.4 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తూర్పుగోదా వరి జిల్లా తాళ్లపూడిలో 6 సెంటీమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో 7, కదిరిలో 4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

శ్రీవారి ఆలయంలో రేపు ఆణివార ఆస్థానం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం ఘనంగా నిర్వహించనున్నారు. ఆ రోజున సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకిపై తిరుమల వీధుల్లో ఊరేగుతారు. ఆణివార ఆస్థానం కారణంగా జూలై 16న అష్టదళ పాద పద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. భక్తులతో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండి క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,916 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.87 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్‌లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేనివారికి 24 గంటల్లో, ఎస్ఈడీ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.

రూ.3,000 నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

ఏపీలో 1.60 కోట్ల కుటుంబాల ఎదురుచూపులు

జాబ్ కేలండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగులు గంపెడాశలు



ఉద్యోగాల కల్పన

చంద్రబాబు పాలనలో..	వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో..	
2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు 34,108	2019-24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో శాశ్వత ఉద్యోగాలు 2,21,003	ఔట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగాలు 3,73,695
మే 2019 నాటికి మొత్తం ఉద్యోగులు 3,97,128	కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు 43,923	వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన మొత్తం ఉద్యోగాలు 6,38,621

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు, ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోంది. జాబ్ కేలండర్‌పై గంపెడాశలు పెట్టుకుంది. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఇంటికో ఉద్యోగం వచ్చేంత వరకు 'నిరుద్యోగ భృతి'ఇవ్వాలని కోరుతోంది. అధికారంలోకి వచ్చి నెల దాటినా, నిరుద్యోగ భృతి గురించి మాట్లాడటం లేదని, ఎప్పటి నుంచి ఇస్తారో స్పష్టంగా చెప్పాలని ఆంధ్రప్రదేశ్‌లోని 1.60 కోట్ల కుటుంబాల్లోని యువత డిమాండ్ చేస్తోంది. 2014లో చంద్రబాబు ఇంటికొక ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను నట్టేట ముంచారు. మరోసారి అలాంటి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా నిరుద్యోగ భృతిపై నోరు మెదపక పోవడం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు.. మళ్లీ బూటకపు హామీలతోనే ఇప్పుడు నాలుగోసారి అధికారంలోకి వచ్చారు. కానీ, ఆయన రాజకీయ జీవితంలో చెప్పింది చెప్పినట్లు ఏనాడు ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిన దాఖలాలు లేవు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, హామీలను అమలు చేయడం ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ సంఖ్యలో యువత ప్రభుత్వ కొలువులు వస్తాయని.. లేదంటే నిరుద్యోగ భృతి అందుతుందనే ఆశతో ఎదురు చూస్తోంది. చాలా మంది ప్రస్తుతం చేస్తున్న చిన్నా చితకా పనులు వదిలేసి.. స్టడీ సర్కిళ్లు, లైబ్రరీల బాట పడుతున్నారు. కుటుంబానికి ఆర్థిక భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతితో ఎలాగోలా నెట్టుకు రావచ్చనే ఉద్దేశంతో పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.

సూపర్ సిక్స్ టాప్‌లో భృతి

ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన తమ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులందరికీ ఉద్యోగాల కల్పనతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ.3 వేల భృతి ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటినప్పటికీ ఆ ఊసే ఎత్తట్లేదు. మెగా డీఎస్సీ పేరుతో నామమాత్రంగా ప్రకటించిన 16 వేల పోస్టుల భర్తీ కాస్తా నత్త నడకను తలపిస్తోంది. డిగ్రీ అర్హతతో ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్, పదవ తరగతి అర్హతతో ప్రభుత్వ కొలువుల కోసం పోటీపడే వారు లక్షల్లో ఉన్నారు. వీరితో పాటు ప్రభుత్వ కొలువు సాధించేందుకు ఇంకా వయస్సు ఉండి.. ఆర్థిక తోడ్పాటు లేక పోటీ పరీక్షలను పక్కన పెట్టి ఊళ్లలో వ్యవసాయం, పట్టణాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్న వారందరినీ కలుపుకుంటే దాదాపు ప్రతి ఇంటిలో ఒక నిరుద్యోగి కనిపిస్తున్న పరిస్థితి. ప్రభుత్వ కొలువుల కోసం కష్టపడి ఆగిపోయిన వారందరూ కూటమి ప్రభుత్వ నిరుద్యోగ భృతి హామీతో తిరిగి పోటీ పరీక్షల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ప్రభుత్వం ఈ హామీని అమలు చేయడంలో జాప్యం చేస్తుండటంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గతంలో చేసినట్టే చేస్తారా?

గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2014-19లో నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి.. ఐదేళ్ల పబ్బం గడుపుకుని మొండి చెయ్యి చూపించారు. అప్పట్లో కూడా ఇంటికో ఉద్యోగం అని ఊదరగొట్టి నిరుద్యోగులను నట్టేట ముంచారు. నిరుద్యోగ భృతికి 2017-18లో రూ.500 కోట్లు కేటాయింపులు చేసినప్పటికీ, రూపాయి కూడా ఇవ్వలేకపోయారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా ఒత్తిడి తేవడంతో ఎన్నికలకు ముందు యువ నేస్తం పేరుతో తూతూ మంత్రంగా డ్రామా నడిపించారు. విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి సవాలక్ష ఆంక్షలు విధించి నిరుద్యోగ భృతి ఇచ్చే వారి సంఖ్యను భారీగా కుదించారు. తొలుత 12 లక్షల మందికి పైగా నిరుద్యోగ భృతికి అర్హులుగా తేల్చగా.. ఆ తర్వాత పది లక్షలకు కుదించారు. మళ్లీ అందులో 2.10 లక్షల మందే అర్హులంటూ.. 1.62 లక్షల మందికే ఇస్తామని.. దీనికి ఈ-కేవైసీ లింక్ పెట్టి కేవలం వేల సంఖ్యలో మాత్రమే నిరుద్యోగ భృతి ఇచ్చి మమ అనిపించారు. గతంలో ఇలా నిరుద్యోగ భృతి హామీని నీరుగార్చి.. ఉద్యోగాలను భర్తీ చేయకపోగా ఆరోగ్య మిత్రలను, ఫీల్డ్ అసిస్టెంట్లను, గోపాల మిత్రలను ఉద్యోగాల నుంచి తొలగించారు. ఈ సారైనా నిరుద్యోగులు అందరికీ ఉద్యోగాలతో పాటు ఉద్యోగం వచ్చే వరకు భృతి ఇవ్వాలని నిరుద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

'గంటా' ఆస్తుల వేలం!

రుణాలు ఎగ్గొట్టిన కేసులో టీడీపీ ఎమ్మెల్యేకు బ్యాంకు ఝలక్

- మొత్తం రూ.390 కోట్ల రికవరీకి చర్యలు
- ఇప్పటికే పలుమార్లు నోటీసులిచ్చిన ఇండియన్ బ్యాంకు
- అయినా స్పందించని గంటా, ఆయన బంధువులు
- ఆగస్టు 8న ఆస్తులు వేలం వేస్తామని బ్యాంకు ప్రకటన జారీ



సాక్షి, విశాఖపట్నం: మాజీమంత్రి, టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆయన బంధువులు రూ.వందల కోట్ల మేర రుణాలను ఎగ్గొట్టిన కేసులో వారికి అప్పులిచ్చిన ఇండియన్ బ్యాంకు ఆస్తుల వేలానికి ఉపక్రమించింది. రుణాలను వడ్డీతో సహా వసూలు చేసుకునేందుకు వరుసగా డిమాండ్ నోటీసులు జారీచేసినా గంటా బ్యాచ్ పట్టించుకోకపోవడంతో తనఖా పెట్టిన వాటిలో పలు ఆస్తులను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న బ్యాంకు వాటి వేలానికి రంగం సిద్ధంచేసి అందుకు సంబంధించిన తేదీని తాజాగా ప్రకటించింది. గంటా రుణాల ఎగవేత కేసులకు సంబంధించిన వివరాలు ఏమిటంటే..

విశాఖపట్నం వన్‌టౌన్‌లోని లక్ష్మీటాకీస్ వద్ద ప్రత్యూష రిసోర్సెస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో మాన్యుఫ్యాక్చరింగ్, మిషనరీ అండ్ ఎక్విప్‌మెంట్ కార్యకలాపాల కోసం రిజిస్ట్రేషన్ నం.047165తో 2005 ఆగస్టు 18న రిజిస్టర్ అయ్యింది. రూ.500 కోట్ల ఆథరైజ్డ్ క్యాపిటల్, రూ.240.671 కోట్ల పెయిడ్ అప్ కాపిటల్‌తో ఈ సంస్థ ఏర్పడింది. కంపెనీలో యాక్టివ్ డైరెక్టర్లుగా గంటా తోడల్లుడైన పరుచూరి వెంకట భాస్కరరావు, ఆయన సోదరులు రాజారావు, వెంకయ్య, ప్రభాకరరావు ఉన్నారు. ఈ కంపెనీకి భీమిలి టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో పాటు కొండయ్య, బాలసుబ్రహ్మణ్యం, నార్నే అమూల్యలు హామీదారులుగా ఉన్నారు. కంపెనీ విస్తరణ పేరుతో డాబా గార్డెన్స్ శారదా వీధిలో ఉన్న ఇండియన్ బ్యాంకు నుంచి రుణాలు పొందారు. ఇవి పొందినప్పటి నుంచి ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 29 నాటికి ఒక దఫా తీసుకున్న రుణం తాలుకా బకాయిలు అక్షరాలా రూ.390.58 కోట్లుగా బ్యాంకు అధికారులు లెక్కగట్టారు. మరో దఫా రుణానికి సంబంధించి వడ్డీతో కలిసి రూ.141.68 కోట్లు బకాయిలుగా పేరుకుపోయాయని ఇండియన్ బ్యాంకు జారీచేసిన నోటీసుల్లో పేర్కొంది.

నోటీసులిచ్చినా బేఖాతరు.. ఆస్తుల స్వాధీనం..

ఈ నేపథ్యంలో.. 2016 అక్టోబరు 4 నుంచి పలు దఫాలుగా బ్యాంకు అధికారులు నోటీసులు జారీచేసి వడ్డీతో సహా కలిపి బకాయిలు చెల్లించాలని కోరారు. అయినాసరే ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం.. మరోపక్క గడువు ముగియడంతో బ్యాంకు ఆస్తులు స్వాధీనం చేసుకోవడం మొదలుపెట్టింది. అయినప్పటికీ గంటా ముందుకు రాకపోవడం.. బకాయిలు చెల్లించకపోవడంతో మరోసారి ఏడు స్లాట్స్‌లో పూచీకత్తుగా పెట్టిన మరికొన్ని స్థలాల్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు ఈ ఏడాది మార్చి 18న బ్యాంకు నోటీసులు జారీచేసింది. ప్రత్యూష కంపెనీకి చెందిన ఆస్తులు, కంపెనీ డైరెక్టర్లయిన పరుచూరి వెంకట భాస్కరరావు, రాజారావు, వెంకయ్య ప్రభాకరరావుల ఆస్తులతో పాటుగా కంపెనీకి హామీదారులుగా ఉన్న మంత్రి గంటా శ్రీనివాసరావు, కేబీ సుబ్రహ్మణ్యం, అమూల్య ఆస్తులను కూడా స్వాధీనం చేసుకోవడంతో పాటు మరికొన్ని ఆస్తుల వేలం వేస్తున్నట్లు బ్యాంకు ప్రకటన జారీచేసింది. కాగా, గతంలోనే బ్యాంకు కొన్ని ఆస్తులను వేలం వేయగా.. ఇప్పుడు రూ.390 కోట్ల రికవరీకి బ్యాంకు మరిన్ని ఆస్తుల వేలం ప్రకటన జారీచేసింది.

ఆగస్టు 8న ఈ-వేలం..

ఈ ప్రకటనలో.. పద్మనాభం మండలం ఐనద గ్రామం వద్ద ఉన్న సర్వేనెం.12లో వీరికి స్టార్ విలేజ్ పేరున వుడా లేఅవుట్‌లోని 5,326.54 చ.గజాల విస్తీర్ణంలో ఏడు స్లాట్స్‌లో ఉన్న 33 ప్లాట్లను స్వాధీనం చేసుకుంటున్నట్లు నోటీసుల్లో స్పష్టం చేసింది. వీటి విషయంలో ఎలాంటి లావాదేవీలు జరపడానికి వీల్లేదని, బ్యాంకు హెచ్చరిక జారీచేసింది. అదేవిధంగా రూ.390.58 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు గతంలో స్వాధీనం చేసుకున్న స్థిరాస్తుల విక్రయానికి కూడా మార్చి 18న బ్యాంకు మరోసారి నోటీసులు జారీచేసింది. దీనికి సంబంధించిన వేలం ప్రక్రియ కూడా నిర్వహిస్తున్నట్లు పత్రికల్లో శనివారం ఇండియన్ బ్యాంకు ప్రకటనలిచ్చింది. మెస్సర్స్ ప్రత్యూష అసోసియేట్స్ పేరుతో నగరంలోని గంగులవారి వీధిలో ఉన్న 274.65 చ.గజాల వాణిజ్య భవనం వేలం వేస్తున్నట్లు ప్రకటించింది. దీనికి రిజర్వ్ ధరగా రూ.2.56 కోట్లుగా నిర్ణయించింది. దీంతో పాటు ద్వారకానగర్‌లోని అదే సంస్థ పేరుతో శ్రీకాంత కాంప్లెక్స్‌లో ఉన్న ప్లాట్ నం.138సీ లోని 2,500 చ.గజాల విస్తీర్ణంగల రెండు ప్లాట్లను వేలం వేస్తున్నట్లు ప్రకటించారు. వీటికి రిజర్వ్ ధరగా 1.26 కోట్లుగా నిర్ణయించారు. ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా.. ప్రాతిపదికన వేలంలో విక్రయిస్తామని బ్యాంకు వెల్లడించింది. ఆగస్టు 8వ తేదీన గంటా అండ్ కో ఆస్తుల ఈ-వేలం పాట జరుగుతుందని ఇండియన్ బ్యాంకు పేర్కొంది.

జిల్లా వార్తలు

డిప్యూటీ సీఎంను కలిసిన రాయల



డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాయల నాగేశ్వరరావు ఆదివారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి సన్మానించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆత్మీయ అభినందన సభ

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర చిన్నతరహా గ్రానైట్ పరిశ్రమల అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు ఆత్మీయ అభినందన సభ మంగళవారం నిర్వహించనున్నారు. ఖమ్మం మామిళ్లగూడెంలో ఉన్న వీడీసీ ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి హాజరవుతారని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ తెలిపారు.

'రైతుభరోసా' తక్షణమే విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తీగల సాగర్

చింతకాని: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యాన ప్రభుత్వం రైతుభరోసా నిధులు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. చింతకాని మండలం కొదుమూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పెట్టుబడికి అవసరమైన సమయంలో నిధులు జమ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. అలాగే, గతంలో రుణమాఫీకి నోచుకోని రైతులకు సైతం వర్తింపచేయాలని, పంటల మద్దతు ధరపై చట్టం చేయాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పోతినేని సుదర్శన్, మాదినేని రమేష్, నాయకులు బొంతు రాంబాబు, చింతనిప్పు చలపతిరావు, శీలం ఫకీరమ్మ, బిక్కసాని గంగాధర్, రావుల రాజబాబు, కోలేటి ఉపేందర్, మల్లెంపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సరే.. బకాయిలు ఎలా?!

సర్పంచ్‌లు లేక, నిధులు రాక కార్యదర్శులపైనే భారం

- అభివృద్ధి పనులకు అప్పులు తెచ్చి పెట్టిన పలువురు
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బిల్లులు
- బదిలీకి ముందే చెల్లించాలని డిమాండ్



పోలారం గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: 'నాకు గ్రామపంచాయతీ నుంచి రూ.2.50 లక్షల బిల్లులు రావాలి. అభివృద్ధి పనులతో పనులతో పాటు ఇతరత్రా పనులకు పెట్టుబడి పెట్టండని అధికారులు చెప్పారు. ఇప్పుడు బదిలీల ప్రక్రియ మొదలైంది. నేను ఇక్కడి నుంచి వెళ్లిపోతే బకాయిలు రాబట్టుకోవడం ఎలా? సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలకే దిక్కులేదు. మా సంగతి ఏమిటి? బదిలీకి ముందే నాకు డబ్బు చెల్లించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్య చేసుకుంటా' అంటూ ఇల్లెందు మండలంలోని ఓ కార్యదర్శి వాట్సప్ గ్రూప్‌లో చేసిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. పాలకవర్గాల పదవీకాలం ముగిశాక అభివృద్ధి పనులు, కార్యాల నిర్వహణ, పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఖాతాల్లో నగదు లేక అధికారుల సూచనలతో పలువురు కార్యదర్శులు అప్పు చేసి మరీ పెట్టుబడి పెట్టారు. ఇంతలోనే బదిలీల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రస్తుత స్థానం నుంచి వెళ్లిపోతే బకాయిల మాట ఏమిటనే ప్రశ్న వారిని వేధిస్తోంది.

రూ.లక్షల్లో బకాయిలు

గత ప్రభుత్వం తెలంగాణ అవతరణ ఉత్సవాల వేళ పలు పేర్లతో చేపట్టిన కార్యక్రమాలకు కొన్ని చోట్ల సర్పంచ్‌లు, మరికొన్ని చోట్ల కార్యదర్శులు పెట్టుబడి పెట్టారు. చెరువుల పండుగ పేరుతో నిర్వహించిన కార్యక్రమాలు వందలాది మందికి భోజనం పెట్టిన సమయాన ఖర్చయింది. ఇక గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిశాక ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. కానీ వీరికి నిధులు, విధులపై స్పష్టత లేకపోవడంతో భారం కార్యదర్శులపై పడింది. దీంతో ఏ పని చేయాలన్నా కార్యదర్శులు జేబులు తడుముకోవాల్సి వస్తోంది. అంతేకాక గ్రామపంచాయతీ ఖాతాల్లో నిధులు లేక ఒక్కో కార్యదర్శి రూ.50వేలకు పైగానే పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. కొందరైతే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.

ఖాళీ ఖజానా

గ్రామపంచాయతీల్లో ఉద్యోగుల వేతనాల చెల్లింపు, అభివృద్ధి పనుల కోసం ఇంటి పన్నులతోపాటు 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం ఇచ్చే నిధులపై ఆధారపడతారు. అయితే, 2022 ఆగస్టు నుంచి ఎస్ఎఫ్‌సీ నిధులు రావడం లేదు. జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ప్రత్యేక పాలన ప్రారంభమైనప్పటి నుంచి అవీ రావడం లేదు. దీంతో పంచాయతీల ఖజానా ఖాళీ అయ్యాయి. ఫలితంగా కార్మికుల వేతనాలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండగా.. ఇతర పనుల కోసం కార్యదర్శులు అప్పులు చేసి నెట్టుకొస్తున్నట్లు సమాచారం.

సర్పంచ్‌ల బకాయిలు సాగదీత

సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ఆరు నెలలు గడుస్తుండగా.. వారు బాధ్యతలు నిర్వర్తించిన సమయాన ఎస్ఎఫ్‌సీ నిధుల మంజూరు లేకపోవడం, 15వ ఆర్థిక సంఘం నిధులు మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐ, విద్యుత్తు చార్జీలకే సరిపోవడంతో సొంతంగా పెట్టుబడి పెట్టారు. అంతేకాక మరికొందరు గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బకాయిలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా సర్పంచ్‌లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా అడుగు ముందుకు పడలేదు.

బదిలీల సమయం కావడంతో..

ప్రస్తుతం అన్ని శాఖల్లో ప్రభుత్వం బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇందులో భాగంగానే గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీలకు సైతం రంగం సిద్ధమైంది. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతీ మండలం నుంచి 40శాతం కార్యదర్శులను చేయాల్సి ఉంటుంది. అయితే, పదవీకాలం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా సర్పంచ్‌లకే బకాయిలు విడుదల కాకపోగా, తాము పెట్టిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు, తాము బదిలీపై వెళ్లిపోతే పరిస్థితి ఏమిటనే ఆందోళన కార్యదర్శుల్లో వ్యక్తమవుతోంది. ఇల్లెందు మండలంలోని ఒక జీపీ కార్యదర్శి తన బకాయి వెంటనే చెల్లించని పక్షంలో కలెక్టరేట్ ముందు ఆత్మహత్య చేసుకుంటానని కార్యదర్శుల వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇదే ఆవేదన జిల్లాలోని కార్యదర్శులందరిలోనూ ఉన్నట్లు తెలుస్తోంది.

ఆందోళన అవసరం లేదు...

గ్రామపంచాయతీల నిర్వహణ కోసం పెట్టిన పెట్టుబడిపై కార్యదర్శులకు భయం అవసరం లేదు. బదిలీ సమయంలో కొత్త కార్యదర్శులకు చార్జీ అప్పగించే సమయాన బకాయి బిల్లులకు సంబంధించి రశీదులన్నీ సమర్పించాలి. తద్వారా నిధులు మంజూరైన వెంటనే చెల్లింపులు జరుగుతాయి.

– చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం

గందరగోళంగా కార్యదర్శుల బదిలీ ప్రక్రియ

ఇల్లెందురూరల్: జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. జిల్లా వ్యాప్తంగా 332 మంది గ్రేడ్-4 కార్యదర్శులు ఉండగా, తొలుత మండలం యూనిట్‌గా తీసుకుని 89 మందితో, ఆ తర్వాత స్టేషన్ సీనియారిటీ తీసుకుని 79 మందితో బదిలీ జాబితా సిద్ధం చేశారు. చివరకు 40 శాతం మందిని బదిలీ చేయాలని నిర్ణయించడంతో జాబితాలో 133 మందికి స్థానం దక్కింది. కాగా బదిలీ జాబితాలో తప్పిదాలు జరిగాయని పలువురు కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. సుమారు 20 మంది కార్యదర్శులు విధుల్లో చేరిన తేదీని తప్పుగా నమోదు చేయించుకున్నారని, దీంతో సీనియారిటీ జాబితాలో వారి పేర్లు కొంత ముందుకు వచ్చాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కౌన్సెలింగ్‌కు పిలుపు అందక..

జిల్లాలో పనిచేస్తున్న గ్రేడ్-1, 2, 3 కార్యదర్శుల్లో ఏడుగురు స్పౌస్, సీనియారిటీ కోటాలో భద్రాద్రి జిల్లా నుంచి ఖమ్మం జిల్లాకు ఆప్షన్ పెట్టుకున్నారు. కాగా సోమవారం నుంచి అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యదర్శులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లా మార్పుతో ఆప్షన్ ఎంచుకున్న వారి జాబితాపై ఆయా జిల్లాలకు కమిషనరేట్ నుంచి సమాచారం వెళ్లాలి. కానీ ఆదివారం సాయంత్రం వరకు ఈ ప్రక్రియ పూర్తికాకపోవంతో కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. కాగా బదిలీ ప్రక్రియలో గ్రేడ్-4 కార్యదర్శులకు అన్యాయం జరగకుండా చూడాలని సోమవారం జిల్లా అధికారులను కలిసి విన్నవించనున్నట్లు కార్యదర్శుల సంఘం నేతలు తెలిపారు.

నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ముప్పు

సెమినార్‌లో న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి



సెమినార్‌లో మాట్లాడుతున్న న్యాయవాది విద్యాసాగర్‌రెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని, ప్రశ్నించే తత్వాన్ని చంపేసేలా చట్టాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సరికాదని పేర్కొన్నారు. ఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో 'నూతన చట్టాలు-సమాజంపై ప్రభావం' అంశంపై నిర్వహించిన సెమినార్‌కు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షత వహించగా విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం ఏ వర్గంతోనూ కూలంకుశంగా చర్చించకుండా చట్టాల అమలుకు పూనుకుందని తెలిపారు. కొత్త చట్టాల్లో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని చెప్పారు. మహిళలపై దాడులకు సంబంధించి పోలీసులు అప్పటికప్పుడు ఎఫ్ఐఆర్ చేయకుండా 14 రోజుల పాటు కాలయాపన చేసే అవకాశముండడంతో కొనిసార్లు కేసులు తారుమారయ్యే ప్రమాదముందని తెలిపారు. ఈ సెమినార్‌లో సీపీఐ నాయకులు, న్యాయవాదులు దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, జానిమియా, కొండపర్తి గోవిందరావు, కనకం జనార్ధన్, పట్టాభి, ఎస్.కే.లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, శింగు నర్సింహారావు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బూడిద బంగారమాయే..

- మండిపోతున్న బీటీపీఎస్ బూడిద ధర
- ఏడాదికే రెట్టింపు చేసిన వైనం
- ఆపై లోడింగ్‌కు అదనంగా వసూళ్లు





ప్లాంట్ వద్ద బారులు దీరిన లారీలు (ఇన్‌సెట్) లారీలో బూడిద లోడ్ చేస్తున్న దృశ్యం

పినపాక: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు-పినపాక సరిహద్దుల్లో నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్(బీటీపీఎస్)లో బూడిద బంగారంలా మారింది. ఇక్కడ వెలువడే బూడిదను సిమెంట్ ఫ్యాక్టరీలు, ఇటుక బట్టీల యజమానులు కొనుగోలు చేస్తారు. అయితే, మిగతా ప్లాంట్లతో పోలిస్తే ఇక్కడ ధర ఎక్కువగా ఉండడం.. ఏటా పెంచుతుండడం విమర్శలకు తావిస్తోంది. పాల్వంచ కేటీపీఎస్‌లో టన్ను బూడిద రూ.30 నుండి రూ.50 వరకు పలుకుతున్న ధర బీటీపీఎస్‌కు వచ్చేసరికి రూ.130 నుండి రూ.150 వరకు అమ్ముతుండడం గమనార్హం.

ఏడాదిలోనే రెట్టింపు

పవర్ ప్లాంట్‌లో ఏటా బూడిద ధర పెంచుతుండడం గమనార్హం. మొదటిలో టన్ను ధర రూ.60 నుండి రూ.70 వరకు ఉండేది. ఏడాది దాటేలోగా రూ.130 నుండి రూ.150 వసూలు చేస్తున్నారు. ఇక లోడింగ్ చార్జీలు, లారీ అద్దె కలిపితే వినియోగదారులకు చేరే సరికి ధర మరింత పెరుగుతోంది.

టెండర్ల పేరుతో దోపిడీ?

థర్మల్ పవర్ ప్లాంట్లలో వెలువడే బూడిదను కొన్నిచోట్ల స్థానికులకు ఉచితంగా, మరికొన్ని ప్లాంట్లలో టన్నుకు రూ.1 నుండి రూ.30 వరకు వసూలు చేస్తారు. కానీ బీటీపీఎస్‌లో మాత్రం తొలి ఏడాదే రూ.70 వరకు వసూలు చేశారు. ఆపై రూ.130 నుండి రూ.150కి ధర పెంచారు. అయితే, టెండర్ల పేరుతో అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కై ధర పెంచి విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు లోడింగ్ చేసినందుకు రూ.200 అదనంగా వసూలు చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

లోడింగ్ కావడం లేదు..

ప్లాంట్ నుండి సిమెంట్ కంపెనీలు, బట్టీలకు బూడిద తీసుకువెళ్తాను. అయితే, లోడింగ్ కోసం ప్లాంట్ వద్ద ఒక్కోసారి రెండు రోజులు వేచి ఉండాల్సి వస్తోంది. ఇదేమిటని అడితే మెయింటనెన్స్ చేస్తున్నాం, షిఫ్ట్ మారుతోంది, యూనిట్ ఆగిపోయిందని చెబుతున్నారు. ఇకనైనా లారీలకు తొందరగా లోడింగ్ చేస్తే మాకు మేలు జరుగుతుంది.

– రాజు, లారీ డ్రైవర్

స్థానికులకు ధర తగ్గించాలి

ప్లాంట్‌పై ఆధారపడి ఇటుక బట్టీ ఏర్పాటుచేసుకుని బూడిద కొనుగోలు చేస్తున్నాం. అయితే, స్థానిక బట్టీలకు సైతం బయటి వారి మాదిరిగానే ఎక్కువ ధర తీసుకుంటున్నారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేసి స్థానికంగా ఉన్న ఇటుకల బట్టీకి బూడిదను తక్కువ ధరకు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

–సుబ్బారెడ్డి, ఇటుకల బట్టీ యజమాని